

# విముక్తి

– ఉషారాణి భాటియా

జీవితంలో క్లిష్టమైన సమస్య ఎదురైనప్పుడు, పరిష్కారం విషయంలో అందరూ ఒకేలా ఆలోచించరు. సమస్య ఒక విధమైనదే అయినా, పరిష్కారం గురించి ఆలోచించే వారు—వారి వారి మనోతత్వాన్నిబట్టి నిర్ణయాలు తీసుకుంటారు. కొందరి నిర్ణయాలు లౌకికరీతుల పరిధిలో వుంటాయి. మరికొందరి నిర్ణయాలు రాగద్వేషాలకు అతీతంగా వుంటాయి! 'ఏది సరైన నిర్ణయం?' అన్నది ఒక నిగూఢమైన ప్రశ్నే!

త్రిలక్ నగర్ బస్సుస్టాండు దగ్గిర రద్దీగా వుంది. మాలతి చేతిలో పర్సు కుదురుగా పట్టుకుని కుడివైపు చూస్తోంది. నెంబర్లు సరిగా కనపడని రంగుపోయిన బోర్డులు, వేలాడుతున్న జనం....బస్సులు ఒకదాన్ని తరుముకుంటూ ఒకటి వచ్చి వరుసగా నిలబడ్డాయి. మాలతి ఎక్కవలసిన బస్సు ఆఖరున వుంది. ప్రాణాపాయంలో వుండి ఆసుపత్రి చేరవలసినట్లు జనం పరస్పరం తోసుకుంటూ, చెప్పులు చేతిలో వస్తువులు లెక్కచేయకుండా బస్సులోకి జొరబడుతున్నారు. కొంగుతో భుజాలు కప్పుకుంటూ, మాలతి అడుగులు ముందుకు వేసే బదులు వెనక్కి వేసింది. పక్కగా ఓ చెట్టు దగ్గిరకు వెళ్ళి నిలబడింది. రుమాలుతో ముఖం తుడుచుకుని జనంవంక నిస్సహాయంగా చూస్తోంది.

"అరె! మాలతీ ఇవాళ ఇంటికి వెళ్ళవా ఏం?" ఆప్యాయంగా భుజంమీద చెయ్యి పడటంతో వెనక్కి తిరిగింది.

"మరేం! అలాగే వుంది చూస్తుంటే. ఇవాళ బస్సు దొరికేట్లు లేదు" అంది నవ్వుతూ మాలతి.

కమల మాలతి చెయ్యి పట్టుకుని లాగింది. "ఇలా నిలుచుంటే ఆ బస్సు నీ ముందు వచ్చి వాలదు. నాతో పద ఎక్కిస్తాను"

కమలకి దాదాపు మాలతి వయసే. మాలతి కాస్త బొద్దుగా రంగుచీర, గాజుల గలగల మెళ్ళో దండలతో కళకళలాడుతోంది. కమల బక్కపలచగా, సాదా చీర, మెళ్ళో పసుపుతాడు, జారు ముడితో పేలవంగా వుంది. ఇద్దరూ ఉద్యోగస్తులే. మాలతి ప్రభుత్వ శాఖలో అసిస్టెంటు. కమల ప్రైవేటు స్కూల్లో టీచరు. న్యాయానికి తొందరగా ఇల్లు చేరుకోవలసిన అవసరం మాలతిది. ఎనిమిదేళ్ళ కొడుకు, నాలుగేళ్ళ కూతురు, భర్త, అత్తమామలు మాలతి రాకకోసరం ఇంట్లో ఎదురుచూస్తుంటారు. వరండాలో టామీ వీధివైపు ముఖంపెట్టి కూర్చుని వుంటుంది. ఆమె ఇంటికి ఎంత తొందరగా చేరితే అంత తొందరగా పని తెములుతుంది. కానీ కమల కాస్త ఆలస్యంగా ఇల్లు చేరినా మించిపోయేదేమీ లేదు. మహా అయితే ఇంటావిడ ఓ మాటు కిటికీ లోంచి తొంగిచూస్తుంది. ఎండిపడివున్న అంట్ల గిన్నెలమించి ఓ పిల్లి ఎగిరి గంతేయవచ్చు. తాళం వేసివున్న తలుపు మీద రోడ్డునపోయే అల్లరిపిల్లలు ఓ రాయి, బంతి విసరవచ్చు. వరండాలో మూలగా పెట్టివున్న కుండీలలోని చెట్లు నీళ్ళకోసరం అలసి కిందికి ఒరగవచ్చు. అంతే....అంతే....ఇంకేం కాదు.

*

త్రిలక్ నగర్ స్టాండునుంచి సీలంబస్సు బయలుదేరింది. మాలతి, కమల గుంపుతోబాటు ముందుకి కదులుతూ చివరికి కిటికీ దగ్గిర చోటుచేసుకున్నారు. గాలికోసరం కిటికీవైపుకి ముఖం తిప్పిన మాలతిని తట్టింది కమల.

"పండక్కి వాళ్ళు వచ్చారు."

మాలతి పరధ్యానంగా స్నేహితురాలివంక చూసింది.

"అత్తగారు, ఆడబిడ్డ – చీర, రవిక పెట్టారు. ఇదే ఆ చీర."

మాలతి కమల చీరవంక చూసింది. ఎర్రంచు ఉల్లిపాయరంగు చేనేత చీర. నలిగిపోయి కమల చిక్కిన శరీరానికి అంటుకుపోయివుంది.

"ఆవిడ ఎంత మంచిదనుకున్నావు. కొడుకుని తిడుతుంది. ఎప్పుడో ఒక రోజు ఆయన నా కాళ్ళ దగ్గిర వచ్చిపడటం కళ్ళారా చూస్తానని ఆమె నమ్మకం. మరో విషయం తెలిసింది. ఆయన విషయం పుకార్లు బయలుదేరి ఆఫీసువాళ్ళు సందేహిస్తున్నారుట... సతాయిస్తున్నారట..." కమల ఆపకుండా చెప్పుకుపోతోంది. మాలతి ఊఁ కొడుతోంది. ఆమె ముఖంలో విసుగులేదు. కళ్ళల్లో దయ మనసులో సానుభూతి పొంగుతున్నాయి.

*